ప్రోటో కాల్ దర్శనాలు రద్దు : ఈవో

ప్రజాశక్తి- ఐరాలు: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ప్రోటోకాల్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు ఆలయ ఈవో వెంకటేశు ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 3గంటలకు ఎన్నికల కమిషనర్ దేశవ్యాప్తంగా పార్లమెంటు, శాసనసభ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేయడంతో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని వివరించారు. శనివారం సాయంత్రం 3గంటల నుంచి జూన్ 6న ఎన్నికల కోడ్ రద్దు అయ్యే వరకు ఆలయంలో ప్రోటోకాల్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు ఈవో తెలియజేశారు. ఇకపై రూ 150, రూ.100, ఉచిత దర్శన క్యూలైన్లలో భక్తులు, అందరూ దర్శనం చేసుకోవాలన్నారు. వీఐపీ గేటు, పిఆర్ఓ ఆఫీసు పూర్తిగా మూసివేయబడుతుందని, భక్తులందరూ సహకరించవలసిందిగా కోరారు.

నేడు గ్రూప్ వన్ పరీక్ష

జిల్లాలో మూడు పరీక్ష కేంద్రాలు

హాజరు కానున్న 2,517 మంది అభ్యర్థులు

జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

జిల్లాలో 2,517 మంది అభ్యర్థులు మూడు పరీక్షా కేంద్రాలైన ఎస్‌వి సెట్, ఆర్‌విఎస్ నగర్, సీతమ్స్ కాలేజీ, చిత్తూరు, పివికెఎన్ డిగ్రీ కళాశాల, చిత్తూరులో పరీక్షలు రాయనున్నారని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రూప్ - 1 పరీక్షలకు సంబంధించి పేపర్ -1 ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, పేపర్ -2 మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 4గంటల వరకు ఉంటుందన్నారు. పేపర్ -1 పరీక్షల కొరకు అభ్యర్థులను ఉదయం 9 నుండి 9.45 గంటల వరకు, పేపర్ -2 కొరకు ఒంటి గంట నుండి 1.45 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రాలలోకి అనుమతి అని, క్షణం ఆలస్యం అయినా అనుమతి ఉండదని పేర్కొన్నారు. అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యే సమయంలో ఏదైన ప్రభుత్వ గుర్తింపు కార్డులను తమ వెంట తీసుకురావాలన్నారు. పరీక్షల నిర్వహణ, పర్యవేక్షణ కొరకు లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లను నియామకం పూర్తి అయ్యాయని, పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదేశాల మేరకు సీసీ కెమెరాలు నియంత్రణలో ఈ పరీక్షలు నిర్వహణ ఉంటుందని తెలిపారు. పరీక్షా సమయం పూర్తి అయ్యే వరకు అభ్యర్థులు హాల్ నుండి బయటకు వెళ్ళడానికి అనుమతి వుండదని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు, అభ్యర్థులకు కావాల్సిన ఓఆర్ఎస్ పాకెట్, ఇతర వైద్య సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రంలోకి హాల్ టికెట్, బాల్ పెన్నును మాత్రమే అనుమతి ఉంటుందని, సెల్‌ఫోన్లు, డిజిటల్ ఫోన్లు, ఇతర సాంకేతిక పరమైన వస్తువులను అనుమతించబడవని పేర్కొన్నారు. అలాగే అభ్యర్థుల కొరకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని పరీక్షా కేంద్రాల వివరాలు, పరీక్ష సమయం తదితర వివరాల సందేహాల నివృత్తికి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెం 94910 77356ను సంప్రదించవచ్చు అని కలెక్టర్ తెలిపారు.

ముసుగు తొలగింది..!

ఎన్నికల బరిలో దిగిన అభ్యర్థులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

2024 సార్వత్రిక ఎన్నికల బరిలోకి అధికార వైఎస్సార్‌సీపీ, ప్రతిపక్ష టిడిపి గెలుపు గుర్రాలను ఆచీతూచీ ఆర్థిక, ప్రజాబలం ఉన్న అభ్యర్థులను దింపాయి. ఎన్నికలకు ముందే అస్త్రశస్త్రాలను సిద్ధం చేస్తూనే ప్రత్యర్థులకు సవాల్ విసురుతూ అధికార పార్టీ అభ్యర్థులను ప్రకటిస్తే.. మూడు రోజుల క్రితమే రెండో జాబితా విడుదలతో తెలుగుదేశం చిత్తూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో పోటీ చేసే అభ్యర్థులను జాబితాను ప్రకటించింది...

'ప్రజా'దృష్టి'

ముందస్తు అభ్యర్థుల జాబితాలో అధికారపార్టీ చిత్తూరు జిల్లాలో ఇద్దరు, ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్పు చేసినా జిడినెల్లూరు టికెట్ మాత్రం డిప్యూటి సిఎం కుమార్తె కృపాలక్ష్మి కన్‌ఫాం చేయడంతో నియోజకవర్గంలో నారాయస్వామిపై ఉన్న వ్యతిరేకతను కాస్త తగ్గించగలిగారనే చెప్పాలి. ఇక పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు వైసిపిపై ఘాటైన విమర్శలు చేసి పార్టీ కార్యక్రమాలకు దూరమయ్యారు. చిత్తూరు సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఏకంగా వైసిపికి రాజీనామా చేసి జనసేన తీర్థం పుచ్చుకుని తిరుపతి నుంచి ఎమ్మెల్యే ప్రచార బరిలో ఉన్నారు. ఇక ప్రతిపక్ష పార్టీల అసెంబ్లీ అభ్యర్థులు ఖరారు కావడంతో జిల్లాలో రాజకీయపార్టీల ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. గెలుపే లక్ష్యంగా ఇరు పార్టీలు ప్రచారంతో ఓటర్లను ప్రభావితం చేస్తేందుకు హామీలను సిద్ధం చేసుకుంటున్నాయి.

గత ఎన్నికల్లో జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో కుప్పం మినహా మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సిపి విజయకేతనం ఎగురవేసింది. 2024 ఎన్నికల్లో సత్తాచాటాలని ప్రయత్నిస్తుంటే 2019 పరాభవానికి ధీటైన సమాధానం చెప్పేలా తెలుగుదేశం, జనసేన, బిజేపి ఉమ్మడిగా అధికారపార్టీకి చుక్కలు చూపించేలా వ్యూహరచన చేస్తోంది.

2019 ఎన్నికల ఫలితాలు చూద్దాం...

పుంగనూరు: జిల్లాలో పుంగనూరు నియోజవర్గాని ఓ హ్యాట్రిక్ ఎంఎల్‌ఏ, రెండు పర్యాయాలు మంత్రిగా పనిచేసిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికార పార్టీ నుండీ పోటీ చేస్తున్నారు. ఈ నియోజకవర్గం నుండీ టిడిపి అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి (చల్లా బాబు) టిడిపి అభ్యర్థిగా పోటీ చేయనున్నారు. 2019 ఎన్నికల్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 1,07,431 ఓట్లు సాధించి చల్లా రామచంద్రారెడ్డిపై విజయం సాధించారు.

చిత్తూరు: జిల్లా కేంద్రమైన చిత్తూరులో వైసిపి నుంచి ఆరణి శ్రీనివాసులు అప్పటికే ఒకసారి వైసిపి నుండీ పోటీ చేసి టిడిపి అభ్యర్థి డీఏ సత్యప్రభపై స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. 2019 తిరిగి వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి టిడిపి అభ్యర్థి ఎఎస్ మనోహర్‌పై 45 వేల ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు.

కుప్పం: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడ్ని వరుసగా గెలిపిస్తోంది కుప్పం నియోజకవర్గం. ఈ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు 1,00,146 ఓట్లుతో విజయం సాధించగా ప్రత్యర్థి వైసిపి అభ్యర్థి మాజీ ఐఏఎస్ చంద్రమౌళి 69,424 ఓట్లు సాధించారు.

పలమనేరు: మాజీ మంత్రి అమరనాథరెడ్డి పలమనేరు నియోజకవర్గం నుండీ తెలుగుదేశం అభ్యర్థిగా, వెంకట్‌గౌడ్ మొదటిసారి వైసిపి అభ్యర్థి 2019 ఎన్నికలో పోటీ చేశారు. వెంకట్‌గౌడ్ 1,19,241 ఓట్లు 54.46 శాతం ఓట్లు రాగా మాజీ మంత్రి అమరనాథ రెడ్డికి 87,625 40.02 శాతం ఓట్లు వచ్చారు. ఈ ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో వైసిపి అభ్యర్థి వెంకట్‌గౌడ్ విజయం సాధించారు.

పూతలపట్టు: పూతలపట్టు ఎస్సీ నియోజకవర్గం. ఈ నియోజకవర్గంలో కొత్తగా పోటీచేసే వారు విజయం సాధించడం అనవాయితీ. వైసిపి నుండీ చిత్తూరు రూరల్ మండలానికి చెందిన ఎంఎస్ బాబు, టిడిపి నుండీ లలిత కుమారి పోటీ చేశారు. 1,03,265 ఓట్లు ఎంఎస్ బాబుకు రాగా టిడిపి అభ్యర్థి లలిత కుమారికి 74,102 ఓట్లు వచ్చాయి. ఎంఎస్ బాబు విజయం సాధించారు.

జీడి నెల్లూరు: ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన జీడి నెల్లూరు నుండీ 2019 ఎన్నికల్లో వైసిపి నుండీ నారాయణస్వామి, టిడిపి నుండీ మాజీమంత్రి కుతూహలమ్మ కుమారుడు హరికృష్ణ పోటీ చేశారు. వైసిపి అభ్యర్థికి 1,03,038 ఓట్లు 59.67 శాతం, టిడిపికి 57,444 ఓట్లు 33.27శాతం వచ్చాయి. వైసిపి అభ్యర్థి నారాయణస్వామి విజయంసాధించారు.

నగరి: నగరి నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో వైసిపి నుంచి ఆర్‌కె రోజా, టిడిపి నుంచి గాలి భానుప్రకాష్ పోటీ చేశారు. ఈ నియోజకవర్గంలో 1,94,748 ఉండగా రోజకు 80,033ఓట్లు రాగా, భానుకు 77,625 ఓట్లు వచ్చాయి. స్వల్ప తేడాతో రోజా గెలుపొందారు.

వైసిపిలో మెజార్టీ 'సిట్టింగ్'లకే...

కుప్పం, పలమనేరు బీసీలకు

ఐదు రిజర్వుడులో నాలుగు మార్పు

మిగిలిన ఏడు 'రెడ్డి'లకే...

పాతవారికే ఎంపి స్థానాలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

సార్వత్రిక ఎన్నికలకు అధికార వైసిపి సమాయత్తం అయ్యింది. కడప జిల్లా ఇడుపులపాయ నుంచి ఒకేసారి 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాలకూ ఒకేసారి అభ్యర్థులను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఇందులో భాగంతా చిత్తూరు జిల్లాలో ఏడు, తిరుపతి జిల్లాలో ఏడు నియోజకవర్గాలకూ అభ్యర్థులను వెల్లడించారు. అందులో ఏడుగురికి 'రెడ్డి' సామాజికవర్గానికే టిక్కెట్లు ఇచ్చారు. వీరంతా కూడా సిట్టింగ్‌లు, వారసులకే ప్రాధాన్యత ఇచ్చారు. ఐదు రిజర్వుడు స్థానాల్లోనూ నాలిగింటిలో అభ్యర్థులను మార్పు చేశారు. కుప్పం, పలమనేరులో మాత్రమే బీసీలు పరిమితమయ్యారు. ఎంపి స్థానాల్లోనూ 'సిట్టింగ్'లో బరిలో నిలవనున్నారు.

చిత్తూరు జిల్లాలో ఏడు నియోజకవర్గాలున్నాయి. రిజర్వుడు స్థానాలైన పూతపట్టుకు మాజీ ఎంఎల్‌ఎ డాక్టర్ సునీల్‌కు సీటు కేటాయించారు. జీడీనెల్లూరు నియోజకవర్గంలో డిప్యూటీ సిఎం కళత్తూరు నారాయణస్వామి కుమార్తె కళత్తూరు కృపాలక్ష్మికి అవకాశమిచ్చారు.

పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నగరిలో ఆర్‌కె రోజారెడ్డి, చిత్తూరులో విజయానందరెడ్డిలకు సీటు కేటాయించారు. కుప్పంలో ఎంఎల్‌సి భరత్‌కు, పలమనేరులో సిట్టింగ్ వెంకటేగౌడను ప్రకటించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 1978లో జనతా పార్టీ తరపున పీలేరులో పోటీచేసి ఓడిపోయారు. ఆ తరువాత పదిసార్లుగా ఎంఎల్‌ఏగా హ్యాట్రిక్ సాధిస్తూనే ఉన్నారు. చిత్తూరులో సిట్టింగ్ ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాస్‌ను తప్పించి విజయానందరెడ్డికి కొత్తగా అవకాశం ఇచ్చారు. చిత్తూరు ఎంపిగా రెండోసారి ఎన్.రెడ్డెప్పకు అవకాశం ఇచ్చారు. నగిరిలో గ్రూప్ రాజకీయాలు తారాస్థాయికి చేరిన నేపథ్యంలో తిరిగి ఆర్‌కె రోజానే ఇక్కడినుంచి బరిలో నిలవనున్నారు. రాజంపేట ఎంపి అభ్యర్థిగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి బరిలో ఉంటారు.

జాతీయ లోక్ అదాలతో 67 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి- పలమనేరు: పట్టణంలోని సీనియర్ సివిల్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను సీనియర్ సివిల్ కోర్ట్ జడ్జ్ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. కక్షిదారులు ఏళ్ల తరబడి పలు కేసులకు సంబంధించి కోర్టు చుట్టూ తిరగనవసరం లేకుండా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జాతీయ లోక్‌అదాలత్‌ను చేపట్టడం ద్వారా ఎన్నో కేసులు త్వరతగతిన పరిష్కారమయ్యాయి అన్నారు. కక్షిదారులు ఇరు పార్టీలు పంతాలకు పోయి వారి సమయాన్ని వృధా చేస్తూ ఉన్నారన్నారు. అందుకే లోక్ అదాలత్‌ను చేపట్టి కక్షిదారుల కేసులను పరిష్కరించడంతో వారి జీవితాలలో వెలుగు నింపడంతో కుటుంబసభ్యులు ఆనందంగా ముందుకు సాగేందుకు తోడ్పాటు అందిస్తుందన్నారు. బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీసు శాఖ, ఏస్ఈబీ పోలీసులు ప్రత్యేక చొరవతో ఇరుపార్టీలకు నచ్చజెప్పి పలమనేరు నియోజకవర్గ పరిధిలోని పెండింగ్లో ఉన్న పలు రకాల కేసులను 75 దాకా శనివారం పరిష్కరించడం జరిగిందన్నారు. ఇందులో సివిల్ కేసులు 5, క్రిమినల్, కేసులు 49, బ్యాంకులకు సంబంధించి 13 కేసులతో కలిపి మొత్తం 67 కేసులు పరిష్కారం కాగా వీటికి సంబంధించి రూ.3,98,83,677లు వచ్చాయన్నారు. కార్యక్రమంలో పలమనేరు డిఎస్‌పి మహేశ్వర్ రెడ్డి, సిఐ చంద్రశేఖర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కే.లక్ష్మీపతి, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: ప్రశాంత వాతావరణంలో స్వార్వత్రిక ఎన్నికలు జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని ఆర్డీవో వెంకటరెడ్డి అన్నారు. శనివారం నగరి ఎంపీడీవో ఆవరణలోని వెలుగు కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలన్నారు. ఈవీఎంల వినియోగం పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులను కల్పిస్తున్నామన్నారు. సరిహద్దు పోలింగ్ కేంద్రాలలో వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ చేయనున్నట్లు తెఇపారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మోడల్ కోడ్‌ఆఫ్ కండెక్ట్ అమలులోకి వచ్చిందని బ్యానర్లు, కటౌట్లు తొలగించాలన్నారు. పోలింగ్ ఏజెంట్లు నియామకంలో ఎన్నికల సంఘం నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. పలు పార్టీల ప్రతినిధులు డీఎస్పీ నరసింహమూర్తి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అమరజీవి 124వ జయంతి

ప్రజాశక్తి- గుడిపల్లి

అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు 124వ జయంతిని పురస్కరించుకుని ద్రావిడ విశ్వవిద్యాలయం, తెలుగుశాఖలో జయంతి సభను నిర్వహించారు. ఈ సభకు తెలుగుశాఖ అధ్యక్షులు డాక్టర్ పళని అధ్యక్షత వహించారు. పళని మాట్లాడుతూ సబర్మతి ఆశ్రమంలో గాంధీజీ స్ఫూర్తితో సత్యం, అహింస, సేవ, నిరాడంబరత అనే మేలిమి గుణాలను శ్రీ పొట్టి శ్రీరాములు అలవర్చుకున్నారని, తెలుగుజాతి ఆత్మగౌరవం కోసం ప్రత్యేక తెలుగు రాష్ట్రాన్ని సాధించే ప్రయత్నంలో ఆత్మ బలిదానం కావించిన మహనీయుడు అని కొనియాడారు. 1952 అక్టోబర్ 19న శ్రీ పొట్టి శ్రీరాములు తన దీక్షను ప్రారంభించి డిసెంబర్ 15వ తేదీ అర్ధరాత్రి ప్రాణత్యాగం చేశారని తెలిపారు. ఆయన బలిదానం వలన 1953 నవంబర్ 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించిందని వివరించారు. రిజిస్ట్రార్ ఆచార్య ఏకే వేణుగోపాల్ రెడ్డి, డీన్ ఆచార్య శివకుమార్, పాలకమండలి సభ్యులు ఆచార్య కే.శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: మండలంలోని కీళ్లపట్ల ప్రాథమిక పాఠశాలలో శనివారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా తన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించినట్లు ఉపాధ్యాయులు తులసినాథం తెలిపారు.

రాజకీయ పోస్టర్లు, బ్యానర్లు తొలగింపు

పారదర్శకంగా ఎన్నికల నియమావళి అమలు : కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలై, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన నేపథ్యంలో నగరంలో ఎన్నికల నియమావళిని పారదర్శకంగా, పక్కాగా అమలు చేయాలని ఎఆర్వో, కమిషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నియమావళి ప్రకారం నగరంలో ఎక్కడ రాజకీయపరమైన పోస్టర్లు, బ్యానర్లు కనిపించరాదన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా శనివారం ఉదయం నుంచే నగరంలో పోస్టర్లు, బ్యానర్లు తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. అన్ని వార్డుల్లోనూ నగరపాలక అధికారులు, వార్డు కార్యదర్శులు, సిబ్బంది జల్లెడపట్టి పోస్టర్లు, బ్యానర్లను తొలగించారు. గోడలు, విద్యుత్ స్తంభాలపై రాసిన వాటిపై తెలుపు రంగు పెయింట్ వేయించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన పోస్టర్లను తొలగించారు. ఎఆర్వో, కమిషనర్ డాక్టర్ జె.అరుణ నగరంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ప్రధాన రహదారులు, కూడళ్లు, వీధుల్లో కలియతిరిగి తనిఖీ చేసి ఎక్కడ రాజకీయపరమైన పోస్టర్లు, బ్యానర్లు ఉండరాదని అధికారులను హెచ్చరించారు. పలు ప్రాంతాల్లో కమిషనర్ స్వయంగా పోస్టర్లను, స్టిక్కర్లను తొలగించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున ఆర్వో (రిటర్నింగ్ అధికారి) అనుమతి లేకుండా రాజకీయపరమైన ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయరాదన్నారు. ఎన్నికల నిబంధనలకు లోబడి రాజకీయ పార్టీలు నడుచుకోవాలని ఎఆర్వో కోరారు. కార్యక్రమంలో ఇన్చార్జి ఎంహెచ్వో చిన్నయ్య, సీఎంఎం గోపి, ఏసీపీ రామకృష్ణుడు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామని తిరుపతి డివిజన్ ఏపీఎస్పీడీసీఎన్ ఎస్ఈ కృష్ణారెడ్డి అన్నారు. శనివారం నగని మండలంలోని పన్నూరు, నింద్ర, కాళికాపురం, కొప్పేడు, ఎం.కొత్తూరు సబ్‌స్టేషన్లను ఆయన పరిశీలించారు. సబ్‌స్టేషన్లలో సమస్యలు ఉన్నాయా అంటూ స్థానిక అధికారులను ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో ట్రాన్స్‌ఫార్మర్ల సమస్య లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి పదవ తరగతి పరీక్షలు, ఆపై ఎన్నికలు ఉన్నాయి కనుక విద్యుత్ సరఫరా ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంటుందని అన్నారు. ఎలాంటి అంతరాయం కలగకుండా విద్యుత్ సరఫరా అందిస్తామన్నారు. గ్రామాలకు విద్యుత్ సరఫరాకు విడిగా విద్యుత్‌లైన్లు ఏర్పాటు చేస్తున్నామని వాటివలన భవిష్యత్తులో ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. సబ్సిడీపై సోలార్ ప్లేటు ఏర్పాటుచేసుకుని విద్యుత్‌ను స్వయంగా ఉత్పత్తిచేసుకొని వినియోగించుకునే పథకంపై విద్యుత్‌శాఖ అవగాహన కల్పిస్తోందన్నారు. ట్రాన్స్‌కో ఈఈ ఎం.చిన్న రెడ్డెప్ప, డిప్యూటీ ఈఈ ఎ.వెంకటముని, ఏఈలు మోహన్‌రావ్, లోకనాథరావ్‌లు పాల్గొన్నారు.

10 పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి- సోమల : ఈనెల 18వ తేదీ సోమవారం నుండి సోమల మండలంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను మూడు పరీక్ష కేంద్రాలలో నిర్వహిస్తూ ఉండగా 353 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు శ్రీరాములు, శివరత్నమ్మ తెలిపారు. మండల కేంద్రమైన సోమల పరీక్ష కేంద్రం నందు 97 మంది విద్యార్థులు, మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 110 మంది విద్యార్థులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్ద ఉప్పరపల్లి సెంటర్ నందు 146 మంది విద్యార్థులు పరీక్షలను రాయనున్నట్లు వారు తెలిపారు. సోమల పరీక్ష కేంద్రం నందు సోమల మరియు సూరయ్య గారి పల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు పరీక్ష రాయనున్నారని, పెద్ద ఉప్పరపల్లి పరీక్ష కేంద్రం నందు పెద్ద ఉప్పరపల్లి, జడ్పీహెచ్ఎస్ నంజంపేట విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలలో ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు.

బంగారుపాళ్యం: రేపటి నుండి పదవ తరగతి పరీక్షలు జరుగుతుందని మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాలను ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెయింట్ మేరీ ఉన్నత పాఠశాల 234 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాల 269 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాల 246 మంది, గుండ్ల కట్టమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 107మంది విద్యార్థులు పరీక్షల్లో పాల్గొంటారని తెలిపారు. పరీక్ష సమయానికి 30 నిమిషాల ముందుగా పరీక్ష కేంద్రాల చేరుకోవాలని పరీక్షలు కట్టుదిట్టంగా జరుగుతుందని తెలిపారు.

తరగతి గదులను పరిశీలిస్తున్న ఎంఈఓ శివరత్నమ్మ

జాతీయ జట్టుకు వెదురుకుప్పం క్రీడాకారిణి

ప్రజాశక్తి- వెదురుకుప్పం: అనంతపురం జిల్లా ఆర్‌డిటి స్టేడియంలో నిర్వహించిన సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్ ఎంపిక పోటీలలో చిత్తూరు జిల్లా నుండి అత్యున్నత ప్రదర్శన కనబరిచిన వెదురుకుప్పం హైస్కూల్ క్రీడాకారిణి ఉమా జాతీయస్థాయి జట్టుకు ఎంపికైనట్టు శనివారం విలేకర్ల సమావేశంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసు తెలిపారు. ఎంపికైన క్రీడాకారిణి ఈనెల 29 నుండి వచ్చేనెల 3వ తేదీ వరకు మహారాష్ట్ర రాష్ట్రం ఔరంగాబాద్ పట్టణంలో జరగనున్న జాతీయ స్థాయి క్రీడాపోటీలలో పాల్గొంటుందని తెలియజేశారు. ఈసందర్భంగా క్రీడాకారిణి ఉమా, పిడి రమేష్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

పారదర్శకంగా విధులు నిర్వహించండి..

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో నగరపాలక పరిధిలోని అధికారులు, ఉద్యోగులు తటస్థంగా, పారదర్శకంగా విధులు నిర్వహించాలని ఎఆర్వో, కమిషనర్ డాక్టర్ జె.అరుణ చెప్పారు. ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో శనివారం సాయంత్రం కమిషనర్, ఎఆర్వో నగరపాలక పరిధిలోని అధికారులు, వార్డు కార్యదర్శులతో వీడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ప్రభుత్వ కార్యాలయాలు, వార్డు సచివాలయాల్లో ఎలాంటి రాజకీయపరమైన, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి చిత్రాలు, పోస్టర్లు ఉండరాదన్నారు. అన్ని వార్డుల పరిధిలో పూర్తిస్థాయిలో రాజకీయపరమైన బ్యానర్లు, పోస్టర్లు, తొలగించాలని, విగ్రహాలకు ముసుగులు వేయాలన్నారు. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల శిలాఫలకాలను మూసి ఉంచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, మైదానాలు, బస్టాండ్లు, డివైడర్లు, ఇతర ప్రాంతాలు అన్నిటినీ పరిశీలించి ఎక్కడా ఎన్నికల నియమావళి ఉల్లంఘన లేకుండా చూడాలన్నారు. వార్డుల్లో ఎక్కడ కొత్త పనులు చేపట్టరాదని స్పష్టం చేశారు. ఎలాంటి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తగా విధులు నిర్వహించాలని అధికారులు, వార్డు కార్యదర్శులను ఆదేశించారు. సాయంత్రం కమిషనర్ మహిళా మార్ట్, నగరపాలక కార్యాలయంలోని బిల్లింగ్ కౌంటర్లను, అన్ని విభాగాలను పరిశీలించారు. నగదు చెల్లించే వారికి ఇచ్చే బిల్లులలో రాజకీయపరమైన ఫోటోలు లేకుండా చూడాలన్నారు. కార్యాలయంలోని సంక్షేమ పోస్టర్లను, ఇతర చిత్రపటాలను తీయించారు. ఆవరణలోని విగ్రహాలకు ముసుగు వేయించారు. అధికారులు, ఉద్యోగులకు మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎంఈ గోమతి, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, సీఎంఎం గోపి, ఇన్చార్జి ఎంహెచ్వో చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పై

పూర్తి అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎన్నికలు నిర్వహణ సజావుగా నిర్వహించాలంటే ప్రధానంగా ఎన్నికల నియమావళిపై అవగాహన చాలా అవసరమని, పూర్తిస్థాయిలో నియమావళిని ఆకలింపు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని డ్వామా ఏపిడి చిన్నరెడ్డన్న అన్నారు. పివికేఎన్ కళాశాలలో నాలుగో రోజు పీఓలు, ఏపీఓలకు శిక్షణలో భాగంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఏపిడి మాట్లాడుతూ ఎన్నికల నియమావళి పుస్తకం ఈ ఏడాది రావడం జరిగిందని, ఎన్నికల ప్రక్రియ నిర్వహణలో ఎప్పటికప్పుడు మార్పులు చేస్తుండడం జరుగుతోందని ఈ మార్పులకు అనుగుణంగా అవగాహన చేసుకోవడం ముఖ్యమని అన్నారు. క్షేత్రస్థాయిలో పిఓలు, ఏపీవోలు ఇతర సిబ్బంది ఎన్నికను ఏ విధంగా నిర్వహించుకోవాలి, ఎవరెవరిని అనుమతించాలి అనే విషయంలో ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని, ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. ఎన్నికలను సక్రమంగా నిర్వహించడం ప్రతి ఉద్యోగి బాధ్యత అని క్షుణ్ణంగా ఎన్నికల నియమావళిని చదివినప్పుడే ఆ విధంగా చేయడానికి వీలు ఉంటుందన్నారు. శిక్షణా కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రబ్బానీ బాష, ఏపీడీ ఉమాదేవి, మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్ పాల్గొన్నారు.

ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా గజ్జల లక్ష్మి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఎపి మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గజ్జల లక్ష్మిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా ఇటీవల ఎపి మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ పదవికి వాసిరెడ్డి పద్మ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.తిరుమలలో శనివారం ఆమె ప్రమాణ స్వీకారం చేశారు. కడప టౌన్‌కు చెందిన గజ్జల లక్ష్మిని ప్రభుత్వం నియమించింది. రెండున్నరేళ్ల పాటు మహిళా కమిషన్ సభ్యురాలుగానూ ఉన్నారు.

ప్రభుత్వ భూముల కబ్జాను అరికట్టండి : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

మంగళం పరిధిలోని రామచంద్ర నగర్ తెలుగు గంగ ఫిల్టర్ హౌస్ మధ్యలో ఉన్నటువంటి రెండు ఎకరాల తుడా ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమార్కులు ఆక్రమిస్తున్నట్టు, కబ్జాకు పాల్పడుతున్నట్టు కథనాలు వస్తున్నాయని, దీన్ని రక్షించాలని తుడ వీసికి సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం, నాయకులు కె.వేణుగోపాల్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. మంగళం ప్రాంతంలో ప్రభుత్వ భూమి కనబడితే చాలు యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నారన్నారు. దాదాపు 25 కోట్ల పైచిలుకు విలువ గల రెండు ఎకరాల భూమిని గుట్టు చప్పుడు కాకుండా ఎన్నికల కోడ్ అడ్డు పెట్టుకుని నిర్మాణాలు చేపడుతున్నా రెవెన్యూ, తుడా అధికారులు స్పందించకపోవడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. తుడా రెవెన్యూ భూమి అని బోర్డు నాటాలని, భూమిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. లేనిచో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

'అరాచక పాలన అంతం'

టిడిపి అభ్యర్థి గురజాల జగన్మోహన్

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: ఎన్నికల కోడ్ అమలుతో రాష్ట్రంలో జగన్ ప్రభుత్వ అరాచకపాలన అంతమైందని టిడిపి అభ్యర్థి గురజాల జగన్మోహన్ అన్నారు. స్థానిక లక్ష్మీనగర్ కాలనీ జిజేఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో విజయం సాధించిన జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధి కోసం చేసింది ఏమీ లేదన్నారు. రాష్ట్ర ప్రజలు 2024లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడుని చూడాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ ఘనవిజయం సాధిస్తుందన్నారు. సురేంద్ర కుమార్, కోదండ యాదవ్, మోహన్ రాజ్, యువరాజు నాయుడు పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఈనెల 17వ తేదీ ఆదివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మండల కేంద్రలో పలు ప్రారంభోత్సవ కార్యాక్రమాల్లో పాల్గొంటారని వైసిపి మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రజనికి డాక్టరేట్

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం గ్రామానికి చెందిన బి.రజనికి అనంతపురం జేఎన్‌టీయు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈమె కలికిరి జేఎన్‌టియు ఇంజనీరింగ్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. జెఎన్‌టియు రిజిస్ట్రార్ శశిధర్, ఎస్వీయూ విశ్రాంత ప్రొఫెసర్ ఏవి నరసింహారావు పర్యవేక్షణలో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో స్ట్రెంత్ అండ్ రబిలిటీ స్టడీస్ ఆన్ జియోపా లిమర్ అండ్ స్టీల్ ఫైబర్ రైన్ ఫోర్స్‌డ్ జియో పాలిమర్ కాంక్రీట్ యూసింగ్ ఫలై యాస్‌సింగ్ అండ్ జీజీబీఎస్ పై పరిశోధన చేశారు.

వైసిపి మహిళా విభాగపు

జిల్లా కార్యదర్శిగా గౌహతి రెడ్డి

ప్రజాశక్తి- పూతలపట్టు: చిత్తూరు జిల్లా వైసీపీ మహిళా విభాగపు కార్యదర్శిగా పూతలపట్టు గౌతిరెడ్డి ఎంపికయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పదవితో తమపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. తనకు పదవి రావడానికి కారకులైన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం తన సాయి శక్తుల కృషి చేస్తామని వివరించారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్సీ

ప్రజాశక్తి- శాంతిపురం: మండలంలోని రాళ్ళబూదుగూరు పంచాయతీలో రైతుభరోసా కేంద్రం, సీసీ రోడ్లు, ఓవర్ హెడ్‌ట్యాంక్‌లను ఎమ్మెల్సీ కెఆర్‌జె.భరత్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వానికి ప్రస్తుత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి తేడాను జనం గమనించాలన్నారు.

గతంలో ప్రభుత్వ నిధులను కేవలం కమిషన్ లు దండుకునేందుకు మాత్రమే వినియోగిస్తే ప్రస్తుతం జగనన్న ప్రభుత్వం పారదర్శకంగా పథకాలను అభివృద్ధిని ప్రజల ముంగిట చేర్చారన్నారు. జడ్పిటిసి శ్రీనివాసులు, ఎంపీపీ వసుంధర కోదండరెడ్డి, మండల కో ఆప్షన్ నిసార్, సర్పంచ్ లక్ష్మి మురుగేశ్, ఉప సర్పంచ్ వెంకటరమణ పాల్గొన్నారు.

'సమర్ధుడికి కాంగ్రెస్ టికెట్ ఇవ్వండి'

ప్రజాశక్తి- వెదురుకుప్పం, ఎస్ఆర్‌పురం: గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అనుకున్న స్థాయిలో ఓట్లు రావాలంటే నియోజకవర్గంలో సమర్ధుడిగా ఉన్న నాయకుడికే ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని నియోజకవర్గ కోఆర్డినేటర్ కన్నన్, మణికృష్ణాలు శనివారం విలేకర్ల సమావేశంలో తెలిపారు. మండలంలోని మర్రిపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులతో కలసి ఇందిరమ్మ అభయం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఇందులో భాగంగా కరపత్రాలు పంపిణీ, అభయం పోస్టర్లు ఆవిష్కరించారు. కిసాన్ సెల్ నాయకులు సుబ్బరాయులు, పాలసముద్రం మండల పార్టీ ప్రెసిడెంట్ పుష్పరాజ్, ఎస్ఆర్‌పురం నాయకులు మోహన్, పిచ్చయ్య పాల్గొన్నారు.

జగన్ పాలనలో స్థానిక సంస్థలు నిర్వీర్యం: అమర్నాథ్ రెడ్డి

ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి

ప్రజాశక్తి- వికోట: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో స్థానిక సంస్థలు నిధులు కొరతతో నిర్వీర్యమయ్యాయని మాజీమంత్రి అమర్నాథ్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని చింతమాకులపల్లి పంచాయతీ గొల్లపల్లిలో శనివారం నిర్వహించిన ఇంటింటికి తెలుగుదేశం , బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామపంచాయతీలకు విడుదల చేసి నిధులను రాష్ట్రప్రభుత్వ పాలకులు దారి మళ్లించి గ్రామాలలో అభివృద్ధిని నీరుగార్చారని విమర్శించారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో నారా చంద్రబాబు నాయుడు హంద్రీనీవా కాలువ ద్వారా వీకోట వరకు నీలు తీసుకురాగా, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కుప్పానికి హంద్రీనీవా కాల్వ ద్వారా కృష్ణాజలాలు అందిస్తున్నట్లు హారతులు ఇచ్చి వెంటనే నీటిని వెనక్కి పంపారని, ఇటువంటి జిమ్మిక్కులను ప్రజలు గమనిస్తున్నారని సరైన సమయంలో సరైన పద్ధతిలో ప్రజలే వారికి బుద్ధి చెప్తారన్నారు. అనంతరం వైసిపికి చెందిన పలువురు నాయకులు అమరనాథ్ రెడ్డి సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. మండల పార్టీ అధ్యక్షుడు రంగనాథ్, రామచంద్ర నాయుడు, రాంబాబు, సతీష్, సోము, ధీరజ్, శబరీష్ పాల్గొన్నారు.

టిడిపి ఇంటింటి ప్రచారం

కార్వేటినగరం : గంగాధర నియోజకవర్గంలో 2024 ఎన్నికలలో టిడిపి జెండాను ఎగరవేసి నారా చంద్రబాబునాయుడుకి కానుకగ ఇస్తామని జీడి నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ అన్నారు. శనివారం కార్వేటినగరం మండలంలోని గాజుల కండిగా, సుద్దగుంట, చింతతోపు, పెద్ద హరిజనవాడ గ్రామాలలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. సిద్ధగుంటలో వైసిపి నుంచి కొందరు నాయకులు టిడిపిలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. జనసేన ఇంచార్జ్ పొన్న యుగంధర్, జనార్ధన్ రాజు, నాగేశ్వరరాజు, చెంగల్రాయల్ యాదవ్, రాజేంద్రరెడ్డి, నర్సింహులు, వాసుదేవ రెడ్డి పాల్గొన్నారు.

గుడిపల్లి: టిడిపి, జనసేన, బిజెపి నాయకులు శనివారం మండలంలోని బేగ్గిలిపల్లి గ్రామపంచాయతీ బండకొత్తూరు, గోకర్లపల్లి, నల్లగంపల్లి, అంజనాద్రిపురం గ్రామాలలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రతి గడపకు వెళ్లి తెలియజేశారు. మండల పార్టీ అధ్యక్షులు బాబు నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్.చంద్రశేఖర్, డాక్టర్ సురేష్ బాబు, హేమాంబర్ గౌడు, బేటప్ప నాయుడు, అమీర్ పాల్గొన్నారు.

సచివాలయాల్లో ఎంపిడిఓల తనిఖీలు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని బ్రాహ్మణపల్లి సచివాలయాన్ని ఎంపిడిఓ వరప్రసాద్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈనెల 18వ తేదీ నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి రానున్నదున సచివాలయంలో ఏ పార్టీలకు చెందిన గుర్తులు లేకుండా చూడాలని, విగ్రహాలకు ముసుగు వేయాలని సూచించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఈవోపిఆర్‌డి పురుషోత్తం, సిబ్బంది ఉన్నారు.

సోమల: సోమల ఎంపీడీవో నారాయణ మండలంలోని అన్నెమ్మగారిపల్లి, పెద్ద ఉప్పరపల్లి, ఆవులపల్లి, వలిగట్ల, తమ్మినాయునిపల్లి, కామిరెడ్డి వారిపల్లి, కందూరు పంచాయితీ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన సచివాలయ సిబ్బందికి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన కారణంగా పలు సూచనలను అందజేశారు. సచివాలయాలకు ఉన్న ప్రారంభోత్సవ పలకలు బ్యానర్లు తొలగించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి లక్ష్మీదేవి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కూటమిలో అనైక్యత తీసుకొచ్చేందుకు వైసిపి కుట్రలు

ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కలికిరి మురళిమోహన్

ప్రజాశక్తి- యాదమరి: జగన్ అనే రాక్షసుడి పాలన నుండి ఏపిని రక్షించడానికి నేడు టిడిపి, జనసేన, బిజెపి పార్టీలు కలిశాయని పూతలపట్టు టిడిపి, జనసేన పార్టీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కలికిరి మురళిమోహన్ అన్నారు. శనివారం ఉదయం చిత్తూరు జిల్లా బిజేపి కార్యాలయంలో ఏర్పాటు చేసినా మీడియా సమావేశంలో డాక్టర్ కలికిరి మురళిమోహన్ మాట్లాడుతూ.. ఏపీ పునర్నిర్మాణం కోసం తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలు కలిసి రాబోవు ఎన్నికల బరిలోకి దిగబోతున్నట్లు ఆయన వెల్లడించారు. కూటమిలో అనైక్యత తీసుకొచ్చేందుకు వైసీపీ కుట్రలు తిప్పికొట్టేలా ఐక్యంగా ఉంటామని స్పష్టం చేశారు. పార్టీ అధినేతల ఆదేశానుసారం మనం పనిచేయాల్సిన అవసరం ఉందని, సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మురళిమోహన్ గుర్తు చేశారు. వైసీపి నాయకులు ప్రజలను మరోసారి నమ్మించేందుకు అబద్దాలే అజెండా పెట్టుకుని ప్రలోభాలకు గురి చేస్తుందని, ప్రజలంతా వైసీపిని ఇంటికి పంపేందుకు సిద్ధం అయ్యారనే విషయం వారు గ్రహించాలని అన్నారు.

దళిత,గిరిజనులపై ఫారెస్ట్, పోలీసుల దౌర్జన్యం ఆపాలి

ప్రజాశక్తి - వెంకటగిరి రూరల్ : దళిత గిరిజనులపై ఫారెస్టు, పోలీసుల దౌర్జన్యం ఆపాలని సిపిఎం నాయకులు వడ్డిపల్లి చెంగయ్య విజ్ఞప్తి చేశారు. దళిత గిరిజనులకు 2 ఎకరాల చొప్పున భూపంపిణీ చేసి, వారు రెండు పూటలా అన్నం తినేందుకు అధికారులు సహకరించాల్నన్నారు. శనివారం పెట్లూరు గ్రామ భూసాధన పోరాట కమిటి ఆధ్వర్యంలో సర్వే నంబర్ 12(1)లో ఉన్న 519 ఎకరాల మేత పోరంబోకు ప్రభుత్వ భూమిని దళిత గిరిజన పేదలు ఆక్రమించుకుని చెట్టు పుట్ట కొట్టి సాగుకు సిద్ధం చేశారు. అయితే పొలం పనులు చేసుకుంటున్న దళిత గిరిజన పేదలపై పోలీసులు, ఫారెస్టు అధికారులు దౌర్జన్యం చేసి బెదిరింపులకు పాల్పడ్డారు. వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా ఫారెస్టు వారు దళిత గిరిజన పేదలను అడుగడుగునా అడ్డుకుంటూ ఉన్నారన్నారు. సర్వే నంబర్ 12(1) రిజర్వు ఫారెస్టు అని ఫారెస్టు వారు అడ్డుకుంటున్నారని, అయితే అది రిజర్వు ఫారెస్టు అయితే ఇదే సర్వే నంబర్‌లో జగనన్న కాలనీ ఎలా నిర్మించాలని, ఎలా పట్టాలిచ్చారని ప్రశ్నించారు. దళిత గిరిజనులపై దౌర్జన్యానికి దిగిన పోలీసు, ఫారెస్టు, రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పేదలకు భూములు పంచాలని డిమాండ్‌చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గోపాలయ్య, రమణయ్య, గురవయ్య, కోటేశ్వరరావు, వెంకట రమణయ్య, రేణుక పాల్గొన్నారు.

పోలీసులతో పేదల వాగ్వాదం

క్రైం న్యూస్

నల్లబెల్లం, సారా స్వాధీనం

వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట గ్రామంలో నాటుసారా తయారీ ముడిసరుకు తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలపేట పంచాయతీ, చిలక పుత్తూరు గ్రామం, నల్లగంగమ్మ గుడి సమీపంలోని ఓ షాపు వద్ద ముగ్గురు వ్యక్తులు నల్ల బెల్లం ఒక మూట, 10 లీటర్ల నాటుసారాయి పెట్టుకొని ఉండగా పోలీసులు రావడాన్ని గమనించి ఇద్దరు వ్యక్తులు సారాయి, నల్లబెల్లంను వదిలివేసి పారిపోతుండగా ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతన్ని విచారించగా అతను మల్లిఖార్జున (56)ని విచారణలో తెలిసిందని, అతని వద్ద నాటు సారాయి తయారు చేయుటకు కావలసిన నల్లబెల్లం, తన షాప్‌లో ఉన్నదని చెప్పగా అతని షాప్‌ను తనిఖీ చేయగా 41మూటల నల్లబెల్లం 3,075 కేజీలు ఉన్నట్లు తెలిపారు. ఈ బెల్లం విలువ సుమారు 1,53,750లు ఉంటుందని, అలాగే నాటు సారాయి విలువ సుమారు 3వేలతో కలిసి రూ.1,56,750లు అని అంచనా వేశారు. మండలంలో ఎవరైనా నాటుసారాయి అక్రమ రవాణా మరియు నల్లబెల్లము అక్రమ నిల్వలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పలమనేరు ఎస్‌డిపిఓ మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. ఎస్సై శ్రీనివాసులును సిబ్బందిని, పలమనేరు డిఎస్‌పి మహేశ్వర్ రెడ్డి, జిల్లా ఎస్పీ అభినందించినట్లు తెలిపారు.

పోలీసులకు ఘనసన్మానం

ప్రజాశక్తి- గంగవరం: గంగవరం మండలం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వాసిస్తున్న కానిస్టేబుళ్లు ఆజాం గౌస్, పరమేష్, సురేష్ బదిలీ అయిన సందర్భంగా శనివారం సీఐ టి.చిన్న గోవిందా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారికి శాలువ కప్పి పూలమాల వేసి వారు చేసిన సేవలను కొనియాడారు. భవిష్యత్తులో వీరికి మంచి ప్రమోషన్లతో ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు.

సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి- యాదమరి: మండలంలోని పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన చిత్తూరు జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ బి.ధనుంజయ రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. శనివారం మోర్దానపల్లిలో రూ.40లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, కొత్తపల్లిలో రూ.20లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్‌క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు. పూతలపట్టు నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్యే సునీల్ కుమార్, బిఎంఆర్ సంస్థల అధినేత మోహన్ రెడ్డి, సర్పంచులు మీనా మనోజ్‌రెడ్డి, వాసుదేవ రెడ్డి, ఎంపీడీవో సింగన్న, యుపిఆర్‌డి హరి ప్రసాద్ రెడ్డి, ఎంఈఓ రుక్మిణి పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి

వార్షిక బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి- సోమల: మండలం ఆవులపల్లె గ్రామంలో వెలసిన అతి పురాతన దేవాలయం టిటిడివారి ఆధ్వర్యంలో శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 16వ తేదీ శనివారం అంకురార్పణతో ప్రారంభమై 26వ తేదీ శయనొత్సవంతో ముగియనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 17వ తేదీ ఆదివారం ధ్వజారోహణం, సూర్యప్రభ వాహనం, 18 హనుమంత వాహనం, 19 సింహ వాహనం, 20 శేష వాహనం, 21 గజవాహనం, 22 గరుడసేవ, 23 బ్రహ్మ రథోత్సవం, 24 అశ్వ వాహనం ఫార్వేట ఉత్సవం డోపు తిరుణాల, 25 చక్రస్నానం, హంస వాహనం ధ్వజాఅవరోహణం. 26 శయనోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నట్లు ఆలయ అర్చకులు గోపి తెలిపారు.

సంక్షిప్త వార్తలు

మహిళా వర్సిటీలో ఘనంగా నేషనల్ టెక్ ఫెస్ట్

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ వారు నిర్వహించిన సదర్వ 2కె 24 టెక్ ఫెస్ట్ ఘనంగా ముగిసింది. విద్యార్థులు టెక్ ఈవెంట్స్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజిని, డైరెక్టర్ ఆఫ్ ఆర్ అండ్ బి డిపార్ట్మెంట్ పి.ఉష, డైరెక్టర్ ప్రొఫెసర్ పి.మల్లికార్జున, కో-ఆర్డినేటర్ బి మాధవి, కన్వీనర్ టీ.లక్ష్మీ ప్రశాంతి, కో-కన్వీనర్ ఎన్.విష్ణు ప్రియ చౌదరి, స్టూడెంట్ కన్వీనర్ అమత తేజస్విని, స్టూడెంట్ కొ-కన్వీనర్ రాజీ పాల్గొన్నారు.

రాములవారికి వెండి లక్ష్మి కాసుల హారం వితరణ

ప్రజాశక్తి రామచంద్రపురం(చంద్రగిరి): చంద్రగిరి పట్టణంలో ఉన్న శ్రీ రాములవారికి స్థానికులు వెండి లక్ష్మీ కాసుల హారాన్ని బహుకరించారు. శనివారం ఉదయం 2 కేజీల 762 గ్రాములు కలిగిన వెండి లక్ష్మి హారాన్ని స్థానిక రాముని భక్తులు విరాళాలు సేకరించి తయారు చేయించారు. ఈ వెండి లక్ష్మీ హారము విలువ సుమారు 2 లక్షల 65 వేలు ఉంటుందని దాతలు తెలిపారు. ఈ హారాన్ని మంగళ వాయిద్యాలు, రామ భజన నడుమ ఆలయానికి తీసుకొచ్చి ఆలయ అధికారులకు అందజేశారు. ఆ తర్వాత లక్ష్మి హారం స్వామి వారికి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఇన్స్పెక్టర్ముని హరి బాబు, సూపరింటెండెంట్ శ్రీనివాసులు,ఆలయ అర్చకులు శ్రీనివాస బట్టర్, మోహన్ స్వామి, మేళం సిబ్బంది దేశయ్య పాల్గొన్నారు.

కలిసికట్టుగా వైసిపిని ఓడిస్తాం : ఎస్వీవి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కలిసికట్టుగా అధికార పార్టీ వైసీపీని ఓడిస్తామనీ, కూటమి అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు అన్నారు. శ్రీకాళహస్తిలో కూటమి అభ్యర్థిగా బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పేరును అధిష్టానం ప్రకటించిన నేపథ్యంలో శనివారం రాజకీయ భవిష్యత్తు కార్యాచరణపై ఓ నిర్ణయానికి రానున్నట్లు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే ఎస్సివి నాయుడు ఓ ప్రకటన చేశారు. ఈ ప్రకటన రాజకీయ వర్గాల్లో దుమారం లేపింది. ఆయన పార్టీ మారతారనీ, టీటీడీ అసంతప్త నేతలతో కలిసి కాంగ్రెస్ లో చేరుతారన్న చర్చ నడిచింది. అయితే ఎస్సీవీ నాయుడు కూటమి అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డితో కలిసి శనివారం తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవనీ, కూటమి ఎవరికి టిక్కెట్ ఇచ్చినా గెలిపించుకోవలసిన బాధ్యత తమపై ఉందని సంయుక్తంగా తెలియజేశారు.

'ఆరణి'కి స్వాగతం పలికిన పసుపులేటి

ప్రజాశక్తి - తిరుపతి: సిటిజనసేన, టిడిపి, బిజెపి ఉమ్మడి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకు సింగాలగుంటలో డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిని అభివృద్ధి బాట పట్టించాలంటే తనను గెలిపించాలన్నారు. జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ తమ పార్టీ అధినేత ప్రజల బాగు కోసం మాత్రమే కొన్ని మెట్లు తగ్గారన్నారు. ఆరణిని గెలిపించి అరాచక పాలనకు చరమ గీతం పాడతామన్నారు. తమ అధినేత పవన్‌కల్యాణ్ నిర్ణయమే తమకు శిరోధార్యమన్నారు. అధినేత నిర్ణయించిన వ్యక్తిని తిరుపతి నుంచి గెలిపించి కానుకగా ఇస్తామన్నారు. చందు, రాజేష్‌యాదవ్, భాను, క్రిష్ణయ్య, ఆనంద్, కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా కెశ్విన్ మోటార్స్ గ్రూప్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-తిరుపతి సిటి: ప్రముఖ ఆటోమొబైల్స్ సంస్థ కెశ్విన్ గ్రూప్ 2వ వార్షికోత్సవ వేడుకలను తిరుపతి రూరల్ మండలం తనపల్లి క్రాస్ లో ఉన్న పిఎల్ ఆర్ గ్రాండ్ కల్యాణ మండపంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సంస్థ ఎండి ఉదయకుమార్ రెడ్డి, సీఈఓ వెంకట్, జీఎం విమల్ సిబ్బంది సమక్షంలో భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థ 2వ వార్షికోత్సవం పురస్కరించుకుని టివిఎస్, ఎంజి కార్లు కొనుగోలుపై వినియోగదారులకు రాయితీ ఇస్తామన్నారు. అలానే తమ షోరూంలు రాయలసీమలోని తిరుపతి, నెల్లూరు, కడప, అనంతపూర్, కర్నూల్ జిల్లాలలో ఉన్నాయన్నారు. వార్షికోత్సవం సందర్భంగా సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. షోరూమ్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రోత్సాహక సర్టిఫికెట్లు జ్ఞాపికలు అందజేశారు. తమ సంస్థలో ఇప్పటికే 350 మంది ఉద్యోగులు ఉన్నారని, రానున్న ఏడాదికి 500 మంది ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు సంస్థ అధినేత ఆర్.ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు.

ఆరోగ్య సంరక్షణలో అగ్రగామి ఆయుర్వేదం

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్ 3 కుంట్రపాకంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా శనివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం జరిగింది. ఆయుర్వేద ఆస్పత్రి పంచకర్మ స్పెషలిస్టు రవి, క్షారసూత్రా స్పెషలిస్టు డాక్టర్ శ్రీ జ్యోస్న ఆయుర్వేదంపై అవగాహన కల్పించి, ఉచిత మందుల పంపిణీతో పాటు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. ఆయుర్వేదం జీవనశైలి సహజమైన రోగ నిరోధక శక్తిని పెంచడంపై దృష్టి పెడుతుందన్నారు. సరైన నిద్ర వ్యాధులలో సగం నయం చేస్తుందని, మనిషికి ఆహారం ఎంత ముఖ్యమో, అతినంత నిద్ర అంతే ముఖ్యమన్నారు. ఆరోగ్యవంతుడు రోజుకు కనీసం ఆరు గంటలు నిద్ర పోవాలన్నారు. ప్రోగ్రం అధికారిణి నీరజ, సర్పంచి శుభా పద్మనాభం రెడ్డిపాల్గన్నారు.

లోక్ అదాలత్ తీర్పు 'సుప్రీం'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : లోక్ అదాలత్ తీర్పు సుప్రీంకోర్టు తీర్పుతో సమానమని 12వ అదనపు జిల్లా జడ్జ్ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ ఆదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ లోక్ అదాలతో ఇచ్చే తీర్పు సుప్రీంకోర్టు తీర్పుతో సమానమన్నారు. దీనికి తిరిగి అప్పీల్ లేదని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షి దారులు ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే కోర్ట్ పరిధిలో పెండింగ్ లో ఉన్న అన్ని రకాల రాజీపడని క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మోటార్ ప్రమాద పరిహార కేసులు, లేబర్ కేసులు, సివిల్ కేసులు, కోర్టు వరకు వెళ్లని రాజీ పడదగిన తగాదాలు లోక్ అదాలత్ తో పరిష్కరించుకోవచ్చని అన్నారు. సీనియర్ సివిల్ జడ్జ్ బేబీ రాణి, ఇంచార్జి అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ సత్య కాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పోరంబోకు భూమిలో అక్రమ నిర్మాణం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

మంగళం పరిధిలోని ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీ పరిధిలోని మంగళం గ్రామ రెవెన్యూ లెక్క దాఖలా సర్వేనెంబర్ 76లో 2.62 ఎకరాలు, 77లో 2.33 ఎకరాల రోడ్డు పోరంబోకు భూమిలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఎన్నికల సమయం కావడంతో అధికారులు ఎన్నికల విధుల్లో తలమునకలై ఉన్నారు. ఇదే అదునుగా భావించిన కబ్జాదారులు రాత్రికి రాత్రే చిన్నపాటి గది నిర్మాణం పూర్తి చేసి రంగులు కూడా వేసేశారు. కాగా సదరు సర్వే నెంబర్ల భూమి రోడ్డు పోరంబోకుగా రికార్డుల్లో ఉందని సమాచారం. దీనిపై 2006లో అప్పటి ఉమ్మడి చిత్తూరు జిల్లా తిరుపతి రెవెన్యూ డివిజన్ ఆర్డిఓగా బాధ్యతలు నిర్వర్తించిన బాబయ్య గెజిట్ 138/2006 విడుదల చేసినట్టుగా తెలుస్తోంది.

శ్రీవారి దర్శనానికి ఎన్నికల కోడ్

ప్రజాశక్తి - తిరుమల

లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో టీటీడీ ధర్మకర్తల మండలి నిర్ణయం మేరకు శనివారం నుండి తిరుమలలో వసతి, శ్రీవారి దర్శనానికి సిఫారసు లేఖలను రద్దు చేస్తున్నట్లు టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. స్వయంగా వచ్చే ప్రోటోకాల్ ప్రముఖులకు, వారి కుటుంబ సభ్యులకు నిర్దేశించిన విధివిధానాల మేరకు దర్శనం, వసతి కల్పిస్తారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు ఏ రకమైన వసతి, దర్శనాలకు సిఫారసు లేఖలు స్వీకరించబడవు. భక్తులు, విఐపిలు సహకరించాలని పేర్కొంది.

In The Court of The Senior Civil Judge:Penukonda

O.S. No: 15/2018

Between:
G.Sreenivasulu and others ...**Plaintiffs**
And
G.Venkatesulu and others ...**Defendants**

Summons To Defendant No:11

To
D11:N.Govindu S/o N.Kristappa, 41 Years, Business, D.No:2-50, Kelavali (Village), Turlapalli (Post), Peddahanjani (Mandal) Chittoor (Dist).

ఇందుమూలముగా మీకు తెలియజేయడం ఏమనగా పై దావాలో మీకు ఎన్ని సార్లు సమన్లు పంపించినను మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. మీ హాజరు నిమత్తం పై దావా 22/03/2024 వ తేదిన వాయిదా వేసినారు కావున 22/03/2024 వ తేదిన పై కోర్టులో ఉదయం 10:30 గం॥లకు ఖుద్దన గానీ, వకీలు ద్వారా గానీ హాజరై అక్షేపణలు తెలుపుకొనవచ్చును. లేనిచో పరోక్షంగా తీర్మానించెదరు.

(By order of the court)

Md.ASIF,Advocate,
Penukonda, Sri Sathya Sai Dist.